www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 1 VOLUME : 1 | సంచిక: 346 ISSUE : 346 | బుధవారం, 13 మే, 2026 WEDNESDAY, MAY 13, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

## భగీరథకు సిట్ నోటీసులు

- నేడు విచారణకు రావాలని ఆదేశం
- హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్
- 14న విచారించనున్న వెకేషన్ బెంచ్
- చట్టానికి నా కొడుకు అతీతుడేవి కాదు
- కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టీకరణ

2లో..



## డిజిటల్ మెంబర్‌షిప్‌పై కేసీఆర్ ఫోకస్

- భవిష్యత్తు ఎన్నికల దృష్ట్యా కేసీఆర్ డిజిటల్ వ్యూహం
- ప్రతి నియోజకవర్గానికి సమన్వయకర్తలు..
- 71 వేల మంది కార్యకర్తలకు శిక్షణ..
- పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదుపై ప్రధానంగా దృష్టి
- జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌ల నియామకం
- పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి
- బీఆర్ఎస్ ముఖ్యనేతలతో ఆరు గంటలు సుదీర్ఘ చర్చ



పూర్తి వివరాలు 2లో..

బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ దాదాపు ఆరు గంటలుగా కొనసాగింది. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ వివిధ అంశాలపై పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు ప్రక్రియ, పార్టీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం సహా పార్టీ బలోపేతం వంటి ముఖ్యమైన విషయాలపై కేసీఆర్ అధ్యక్షతన చర్చ జరిగినట్లు సమాచారం.

## ధాన్యం సేకరణలో అలసత్వం వద్దు

- సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు
- ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే
- అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ
- లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి
- కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు





హైదరాబాద్, (వార్త వేదిక సూర్య) మే12: ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను మిగతా 2లో..

## అస్సాం సిఎంగా హిమంత బిశ్వశర్మ

- ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు
- ఎన్‌డి ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక

గౌహతి, (వార్త వేదిక సూర్య)-మే12: అస్సాం ముఖ్యమంత్రిగా హి మంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో వరుసగా రెం డోసారి సీఎం పదవిని చేపట్టిన తొ లి భాజపా నేతగా హిమంత నిలి చారు. ఆయనతో పాటు మరో న లుగురు మంత్రులు ప్రమాణం చే శారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవ ర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆ యనతో ప్రమాణస్వీకారం చేయిం చారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి మిగతా 2లో..








## జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ

- రెండో విడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం
- స్పెషల్ డైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ
- అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే12: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్ లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్దిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డైవ్ నిర్వహించాలన్నారు. హైదరా బాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరు లోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగు లేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్‌ఛార్జి మిగతా 2లో..





## ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

- బ్రిటీష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు
- తాను ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా
- చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్ శుక్లా

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య) మే12: స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం మిగతా 2లో..

## నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

- పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టిఏ నిర్ణయం
- సిబిఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి
- నీట్ పేపర్ లీక్ కేసు13మంది అరెస్ట్

న్యూఢిల్లీ, (వార్త వేదిక సూర్య)-మే12: జాతీయ అర్హత పరీక్ష నీట్ యజీ 2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెను దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది. విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు మిగతా 2లో..



సంపుటి: 1 సంచిక: 346 వార్త వేదిక సూర్య బుధవారం, 13 మే, 2026

## నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే 12:

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ఈనెల 21 వరకు జరుగనున్నాయి. ఉ దయం ఫస్టియర్, మధ్యాహ్నం సెకండియర్ విద్యార్థులకు పరీక్షలను నిర్వహించనున్నట్లు బోర్డు అధికారులు మంగళవారం తెలిపారు. 5 నిమిషాలకంటే ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అను మతించబోమని స్పష్టం చేశారు. పరీక్షల నేపథ్యంలో నాంపల్లి లోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పా టు చేసినట్టు తెలిపారు. విద్యార్థులు 040 – 24655027, 92402 05555 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జవాబుపత్రాల మూల్యాంకనం మొదటి విడత ఈనెల 21 నుంచి ప్రారంభం కానుండగా, 24 నుంచి రెండో విడుత మూల్యాంకనం ప్రారంభించనున్నట్టు ఇంటర్‌బోర్డు అధికారులు తెలిపారు. మూల్యాంకనాన్ని త్వరగా పూర్తిచేసి జూన్ రెండో వారంలో ఫలితాలు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

## అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మం త్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రు లు హాజరయ్యారు. హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రు లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మో దీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజే పీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలు చుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీ లైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాం గ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాము లైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మడోసారి తమ ప్రభుత్వాన్ని ఏ ర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించా రు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిస్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. హిమంత ప్రమాణస్వీకార కార్యక్ర మానికి పీఎం మోదీ సహా పలువురు కీలక నేతలు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

## రాష్ట్రానికి 22 టిఎంసిలు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే12:

ఏపీ, తెలంగాణ తాగునీటి అవసరాల మేరకు కృష్ణా జలా లను వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆరఎంబీ) సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్‌లో జరిగిన కేఆరఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఇరు రా ష్ట్రాల ఈఎన్సీలు, ఉన్నతాధి కారులు పాల్గొన్నారు. సాగర్‌లో ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీల వినియోగానికి కేఆర ఎంబీ అనుమతించింది. తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశై లం నుంచి 6 టీఎంసీల వినియోగానికి అంగీకారం తెలిపింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలంగాణ అధికారులు కేఆరఎంబీ దృష్టికి తీసుకెళ్లారు.

## ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

(మొదటి పేజీ తరువాయి)

ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు.మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జెన్సీ సమయంలో 21 రోజులు తా ను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మం త్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకు న్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చా యని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవ సరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారు లకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురా వాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్ర మాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియా లు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరి త్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది.

# ధాన్యం సేకరణలో అలసత్వం వద్దు

(మొదటి పేజీ తరువాయి)



గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలిలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ మెంబర్‌షిప్‌పై ఫోకస్



సిద్దిపేట, (వార్త వేదిక సూర్య)-మే12:

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన మంగళవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శులు సమావేశం అయ్యారు. ఈ సమావేశం లో పలు కీలక అంశాలపై బీఆర్ఎస్ నేతలతో కేసీ ఆర్ సుదీర్ఘంగా చర్చించారు. దాదాపు ఆరు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు కా ర్యాచరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమం, డిజిటల్ విధానాల అమలు వంటి పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఎలక్షన్ కమిష న్ ఆఫ్ ఇండియా చేపడుతున్న సర్ ప్రక్రియ, ఓటర్ లిస్టు సవరణ వంటి కార్యక్రమాలు పూర్తిగా డిజిటల్ విధానంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో బీఆ ర్ఎస్ సభ్యత్వ నమోదు కూడా డిజిటల్ పద్ధతిలో నిర్వహించాలని ఈ సమావేశంలో కేసీఆర్ నిర్ణయిం చారు. భవిష్యత్తు రాజకీయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పార్టీ వ్యవస్థను సాంకేతికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో అధినేత ఈ నిర్ణయం తీసు కున్నట్లు గులాబీ నేతలు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గానికి రాష్ట్ర కమిటీ నుంచి ప్రత్యేక సభ్యత్వ సమన్వయకర్తను నియమించాలని ఈ సమావేశంలో కేసీఆర్ నిర్ణయించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం సమర్థవంతంగా సాగేందుకు మండలాలు, మున్సిపల్ బాడీల వారీగా ప్రత్యేక సభ్యత్వ సమన్వయ కమిటీలను రెండు, మూడు రోజుల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని 35,655 పోలింగ్ కేంద్రాల్లో డిజి టల్ సభ్యత్వ నమోదు నిర్వహించడానికి ప్రతి పో లింగ్ కేంద్రానికి ఇద్దరు కార్యకర్తల చొప్పున మొత్తం 71,310 మంది కార్యకర్తలకు శిక్షణ ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించారు. డిజిటల్ మెంబర్‌షిప్ ప్రక్రియ, సాంకేతిక విధానాలు, సభ్యత్వ నమోదు యాప్ వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణా తరగ తులు నిర్వహించాలని గులాబీ బాస్ దిశానిర్దేశం చేశారు.

**శిక్షణా శిబిరాల నిర్వహణ..**

పార్టీ ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణా శిబిరాలు నిర్వహించాలని కేసీఆ ర్ నిర్ణయం తీసుకున్నారు. సభ్యత్వ నమోదు కార్య క్రమం పారదర్శకంగా, వేగవంతంగా జరిగేలా ప్ర త్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధినేత మార్గనిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ సభ్యత్వ నమో దు కార్యక్రమం చేపడుతున్నట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. డిజిటల్ వ్యవస్థ ద్వారా కార్యకర్తల డేటా బేస్‌ను పటిష్టం చేసి భవిష్యత్తు ఎన్నికలకు సిద్ధం కా వాలని కేసీఆర్ సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం పర్యవేక్షణ కోసం కేసీఆర్ ఆయా జిల్లాల వారీగా కీలక నేతలను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు.

**జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌ల నియామకం..**

ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలు – తక్కళ్లపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్సీ, ప్రధాన కార్యదర్శి.
జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలు — జీవన్ రెడ్డి, మాజీ మంత్రి, ప్రధాన కార్యదర్శి
ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలు — సత్యవతి రాథోడ్, మాజీ మంత్రి, ప్రధాన కార్యదర్శి
జనగాం, హనుమకొండ, వరంగల్ జిల్లాలు – పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే, ప్రధాన కార్యదర్శి.
మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాలు – గ్యాదరి బాలమల్లు, ప్రధాన కార్యదర్శి.
నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు – గంగాధర్ గౌడ్ మాజీ ఎమ్మెల్సీ, ప్రధాన కార్యదర్శి.
మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలు – నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ, ప్రధాన కార్యదర్శి.
ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలు – రావుల శ్రావణ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి.
వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలు – సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే.
మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలు – మహ్మద్ అలీ, మాజీ మంత్రి
గద్వాల్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలు – మెట్టు శ్రీనివాస్, కార్యదర్శి
మేడ్చల్ – మల్కాజిగిరి, యాదాద్రి జిల్లాలు – పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్
హైదరాబాద్ జిల్లా – తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే
నల్గొండ, సూర్యాపేట జిల్లాలు – ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి.

## ఇందిరమ్మ ఇండ్లు జూన్ 2న రెండో విడత పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)



మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సవిక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిథిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్దిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గం లోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్దిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్దిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్దిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించా లన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెనఎన్ యుఆరఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశిరచారు. అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు.

## చిన్నారి హత్య కేసులో నిందితుడికి మరణ శిక్ష

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే12:

ఓ బాలుడి హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పునిచ్చింది. చిన్నారిని హత్య చేసిన వ్యక్తికి మరణశిక్ష విధించింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లో 2023 సంవత్సరంలో జరిగిన మైనర్ హత్యోదంతం సంచలనం సృష్టించింది. ఇమ్రాన్ అలీ ఖాన్ (33) అనే వ్యక్తి చిన్నారిని హత్య చేయగా.. అతనికి మహమ్మద్ రఫీక్ (32) సహకరించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై సనత్‌నగర్ పోలీసులు అప్పుడే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఇమ్రాన్ అలీ ఖాన్, మహమ్మద్ రఫీక్‌ను గుర్తించి అరెస్టు చేశారు. కేవలం సాంకేతిక సాక్ష్యాలతో కేసును ఛేదించి.. వివరాలను కోర్టుకు సమర్పించారు. పకడ్బందీగా సాక్ష్యాలు ఉండటంతో సంతృప్తి చెందిన కూకట్‌పల్లి కోర్టు.. చిన్నారిని వారే హత్య చేసినట్లు నిర్ధారిస్తూ దోషులుగా తేల్చింది.

## నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

**13మంది అరెస్ట్**

రాజస్థాన్‌లోని సికార్‌లో నీట్ పేపర్ లీక్ కేసు వ్యవహారంలో 13 మందిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వీరిని పోలీసులు విచారిస్తున్నారు. 'గెస్ పేపర' పేరుతో మార్కెట్‌లోకి ఈ నీట్ ప్రశ్నాపత్రం వచ్చింది. ప్రభుత్వం నిర్వహించిన ప్రశ్నాపత్రంతో ఈ 'గెస్ పేపర' 100 శాతం సరి పోలినట్లు అధికారులు గుర్తించారు. అలాగే మే 3వ తేదీన ఈ నీట్ పరీక్ష నిర్వహించగా.. అంతకు ముందే ఈ పరీక్ష పేపర్ లీక్ అయినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ప్రశ్నాపత్రం రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు గుర్తించారు. కేరళలోని ఒక ఎంబీబీఎస్ విద్యార్థి వద్ద ఈ పేపర్ లీక్ అయినట్లు పోలీసులు కనుగొన్నారు. మే 1వ తేదీన సికార్‌లోని స్నేహితుడితో ఎంబీబీఎస్ విద్యార్థి ఈ ప్రశ్నాపత్రం పంచుకున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత కోచింగ్ సెంటర్లు, అభ్యర్థులకు ఈ పేపర్ లీక్ అయినట్లు సమాచారం.నైల్ పరీక్షల్లో అసలు ప్రశ్నాపత్రంలోని 140 ప్రశ్నలు సరి పోలాయి. ఈ 140 ప్రశ్నలు సోషల్ విడియాలో విస్తృతంగా వైరలయ్యాయి. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరీక్ష నిర్వహించే తేదీలు త్వరలో ప్రకటిస్తామని వెల్లడించింది.

## భగీరథకు సిట్ నోటీసులు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మే12:

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు ఆదేశించారు. సిట్ అధికారులు బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌ను విచారించనున్నారు. ఈ కేసుకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బాధితురాలి స్టేట్‌మెంట్ నమోదు చేసిన అనంతరం పోలీసులు ఈ కేసులోని సెక్షన్లను మార్చారు. గతంలో నమోదు చేసిన పోక్సో యాక్ట్ సెక్షన్లను సవరించారు.

**హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. పిటిషన్‌పై ఈనెల 14న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపే అవకాశం ఉంది.అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. చట్టం అందరికీ ఒక్కటేనని, తన కొడుకైనా మరెవరైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

# క్రీడా ప్రాంగణాలు, పార్కుల అభివృద్ధికి శ్రీకారం





- రాజేంద్రనగర్ జోన్‌లో అధికారుల విస్తృత తనిఖీలు
- మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం: జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

మైలర్ దేవ్ పల్లి,మే 12 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు, మెరుగైన క్రీడా వసతులను అందుబాటులోకి తీసుకురావడమే ధ్యేయంగా అధికారులు కసరత్తు ప్రారంభించారు. మంగళవారం జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో ఉన్న ప్రధాన పార్కులు, క్రీడా ప్రాంగణాలను ఉన్నతాధికారుల బృందం క్షేత్రస్థాయిలో సందర్శించి, వాటి స్థితిగతులను సమీక్షించారు. జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి, ఎస్.ఈ నరేందర్ గౌడ్, డి.ఈ.ఈ యాదయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా ప్రాంగణాల్లో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఎక్కడెక్కడ కొత్తగా క్రీడా వసతులు కల్పించవచ్చు, ఏ పార్కులను ఆధునీకరించాలి అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సందర్శన అనంతరం అధికారులు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య సంరక్షణలో పార్కులు, క్రీడా మైదానాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కొత్తగా క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు అనువైన స్థలాలను ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. తనిఖీల ఆధారంగా తదుపరి అభివృద్ధి పనుల కోసం సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. పార్కులలో పచ్చదనాన్ని పెంపొందించాలని, క్రీడాకారులకు ఇబ్బంది కలగకుండా మైదానాలను తీర్చిదిద్దాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. రాజేంద్రనగర్ జోన్‌ను మోడల్ జోన్‌గా తీర్చిదిద్దే క్రమంలో పచ్చదనం, క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



## ప్రజలకు పొదుపు చర్యలు సూచించడంలో తప్పేముంది?

- బీజేపీ సీనియర్ నాయకుడు ఆడికే మహేందర్

మైలర్ దేవ్ పల్లి, మే 12 ( వార్త వేదిక సూర్య ) :

భారతదేశ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన సూచనపై కొన్ని ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేయడం సరైంది కాదని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు ఆడికే మహేందర్ అన్నారు. పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని ప్రజలకు బంగారం కొనుగోళ్ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, పొదుపు అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారని తెలిపారు. దేశ ఆర్థిక స్థిరత్వం కోసం నాయకులు ప్రజలకు అవగాహన కల్పించడం సహజమేనని పేర్కొన్నారు. అలాగే, అప్పటి ప్రధానమంత్రి ఇందిర గాంధీ 1967లో ప్రజలకు పొదుపు చర్యలు పాటించాలని సూచించినప్పుడు ఎలాంటి విమర్శలు రాలేదని, ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలకు ఆర్థిక పరిస్థితులపై వివరించడం తప్పేంటని ప్రశ్నించారు. దేశ అభివృద్ధి కోసం ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరమని ఆడికే మహేందర్ పేర్కొన్నారు.

## శ్రీ బాలాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

మైలర్ దేవ్ పల్లి, మే 12 ( వార్త వేదిక సూర్య ) :



శ్రీ బాలాంజనేయ భక్త సమాజం వారి ఆధ్వర్యంలో శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు . మంగళవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించి, అనంతరం భజన కార్యక్రమాలు, చందనం సమర్పణ కార్యక్రమం భక్తి భావంతో నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. శ్రీ బాలాంజనేయ భక్త సమాజం సభ్యులు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు.

## వైభవంగా హనుమాన్ జన్మదినోత్సవం

ఆలయాల్లో తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు

మైలర్ దేవ్ పల్లి, మే 12 ( వార్త వేదిక సూర్య ) :





హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా మారుతీ స్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుద్వేల్ గ్రీన్ సిటీ, నార్సింగి, మరియు మంచిర్యాల గ్రామాల్లోని శ్రీ మహావీర పవనసుత హనుమాన్ దేవాలయం, శ్రీ భక్త వీరాంజనేయ స్వామి దేవాలయాలను ఆయన సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవాలయాల్లో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమంలో తోకల శ్రీనివాస్ రెడ్డి స్వయంగా పాల్గొని, భక్తులతో కలిసి ఆంజనేయ స్వామిని స్మరిస్తూ భజన చేశారు. ఈ సందర్భంగా అక్కడి ఆధ్యాత్మిక సందడి అందరినీ అలరించింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..

ఆంజనేయ స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుం టున్నాను. భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్న ఈ హనుమాన్ జన్మోత్సవం అందరి జీవితాల్లో సుఖశాంతులను నింపాలి. అంటూ భక్తులకు, నియోజకవర్గ ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# హైదర్శకోట్ భాగ్యనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రం



- ఎలుకలు, పందికొక్కుల వల్ల మ్యాన్‌హోళ్లు మూసుకుపోయి రోడ్లపై మురుగు నీరు

మైలర్ దేవ్ పల్లి, మే 12 ( వార్త వేదిక సూర్య ) :

హైదర్శకోట్‌లోని భాగ్యనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. కాలనీలో ఎలుకలు, పందికొక్కులు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను తవ్వి మట్టితో నింపివేయడంతో మురుగు నీరు పైపుల ద్వారా వెళ్లక రోడ్లపై వరదలా ప్రవహిస్తోంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికుల వివరాల ప్రకారం, మ్యాన్‌హోళ్లను సరైన పద్ధతిలో సిమెంట్, కంకరతో బలంగా నిర్మించక పోవడంతో ఎలుకలు మట్టిని సులభంగా తోడేస్తు న్నాయి. అధికారులు తరచూ మట్టిని తొలగించి మురుగు నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకున్నప్పటికీ, వారం రోజుల్లోనే మళ్లీ అదే పరిస్థితి నెలకొంటోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లపైకి వస్తున్న మురుగు నీటి దుర్గంధంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై స్పందించిన భాగ్యనగర్ కాలనీ ప్రెసిడెంట్ పీసీజీ చారి, కార్యదర్శి విశ్వనాథం, సురేందర్ మరియు కౌశిక్ మంగళవారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సమస్యను విన్న కమిషనర్ వెంటనే స్పందించి, దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లను పునర్నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.



## దేశాభివృద్ధికి మోదీ మార్గదర్శకాలే కీలకం: నిరుడు శేఖర్ ముదిరాజ్

మైలర్ దేవ్ పల్లి, మే 12 ( వార్త వేదిక సూర్య ) :

దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచిస్తున్న మార్గదర్శకాలను ప్రతి భారతీయుడు ఒక బాధ్యతగా పాటించాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు, కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్ నిరుడు శేఖర్ ముదిరాజ్ పిలుపు నిచ్చారు. "వికసిత్ భారత్" లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా దేశీయ పరిశ్రమలు బలోపేతమై, ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని తెలిపారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు పెట్రోల్, డీజిల్ వాహనాల కంటే ఎలక్ట్రిక్ వాహనాల (ఈవి ) వైపు మొగ్గు చూపాలని, ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఆదా చేయాలని సూచించారు.

భావితరాల కోసం నీటిని పొదుపు చేయాలని, రసాయన ఎరువులకు స్వస్తి పలికి సహజ సిద్ధమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందన్నారు.

పారదర్శక పాలన కోసం ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలను అలవాటు చేసుకోవాలని ఆయన కోరారు. దేశాభివృద్ధిలో యువత క్రియాశీలక పాత్ర పోషించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, భావి భారత నిర్మాణం కోసం మోదీ నాయకత్వంలో అందరూ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల



సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు మాజీ కార్పొరేటర్ డా. డాక్టర్ హేమ సామల మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి, హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యానగర్ లోని సీతాఫలమండి డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న పరిస్థితులపై మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇంటర్మీడియట్ తరగతుల నిర్మాణం కోసం కొన్ని తరగతి గదులను కూల్చివేయడంతో ప్రస్తుతం డిగ్రీ కళాశాలకు కేవలం మూడు తరగతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అంతరాయం కలగకుండా తాత్కాలికంగా ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఐఈటిఈ భవనానికి కళాశాలను మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి గారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌తో మాట్లాడి అవసరమైన భవనాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ డా. సామల హేమ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.భారతి పాల్గొన్నారు

## భాగ్యనగర్ అయోధ్యా నాథ్ మందిరంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

భక్తిశ్రద్ధలతో పంచామృత అభిషేకాలు, చాలీసా పారాయణం

మైలర్ దేవ్ పల్లి, మే 12 ( వార్త వేదిక సూర్య ) :



శాస్త్రిపురంలోని అయోధ్యా నాథ్ మందిరంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక ఉత్సాహంతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా స్వామివారికి మంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం హనుమాన్ స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి మహా మంగళహారతి నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భజన కీర్తనలు, హనుమాన్ చాలీసా పారాయణం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీ ఆంజనేయ స్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. భక్తులు "జై శ్రీరామ్", "జై హనుమాన్" నినాదాలతో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు.

# హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్

సికింద్రాబాద్, మే 12(వార్త వేదిక సూర్య)

మోండా మార్కెట్ డివిజన్ రెజిమెంట్ బజార్ పలు ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థా ప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలందరికి ఆ యొక్క హనుమాన్ ఆశీస్సులు ఎల్లపుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జితూగుప్తా, ప్రశాంత్ జైన్, సామ్రాట్, ధీరజ్, హరి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు





## శివరాంపల్లి హైస్కూల్‌లో వేసవి శిబిరాల ప్రారంభం

మైలర్ దేవ్ పల్లి, మే 12 ( వార్త వేదిక సూర్య ) :



శివరాంపల్లి హైస్కూల్‌లో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం వేసవి శిబిరాలను ఏర్పాటు చేశారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు క్రీడలు, డ్రాయింగ్ ు క్రాఫ్ట్, పాటలు, పోటీలు, డ్యాన్స్ ప్రాక్టీస్ తదితర అంశాల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ సూచించారు. మంగళవారం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన, పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న రిమీడియల్ క్లాసులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భూకా శ్రీనునాయక్, ఉపాధ్యాయులు కె. శ్రీదేవి, మహేశ్వరి, సిద్ధవ్య, అశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ఎక్తా ర్యాలిలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్

సికింద్రాబాద్, మే 12(వార్త వేదిక సూర్య)



కరీంనగర్ లో మంగళవారం ఘనంగా హిందూ ఎక్తా ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హోం వ్యవహారాల రాష్ట్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనా మాట్లాడుతూ...2029 రానున్న ఎన్నికల్లో బిజెపి పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ తదితరులు పాల్గొన్నారు

## ఎన్నికల ప్రచారం ప్రైవేటు పాఠశాలల ప్రచారం

**-ప్రవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ప్రచారం నిర్వహిస్తున్న నిమ్మకు నీరేత్తినట్లు వ్యవరిస్తున్న అధికారులు**

**-నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి**

**-బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ**

దేవరకొండ మే12 ( వార్తా వేదిక సూర్య):-



ఎన్నికల ప్రచారం ల ప్రైవేటు పాఠశాలలు ప్రచారం నిర్వహిస్తున్నారని బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ ప్రవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ప్రచారం నిర్వహిస్తున్న నిమ్మకు నీరేత్తినట్లు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి అని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో బిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అయన హేచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు పాత్లవత్ లక్ష్మణ్, కౌన్సిలర్ పొట్ట మధు, జమీర్ బాబా,అభి,తదితరులు పాల్గొన్నారు

# కిస్మత్‌పూర్ బస్తీ దవాఖానలో భారీ ఉచిత ఆరోగ్య శిబిరం

**- 186 మందికి వైద్య పరీక్షలు**

**- టిబి నిర్ధారణకు ప్రత్యేక ఎక్స్‌రే, రక్త పరీక్షలు**

మైలర్ దేవ్ పల్లి, మే 12 ( వార్త వేదిక సూర్య ) :

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కిస్మత్‌పూర్ బస్తీ దవాఖానలో మంగళవారం భారీ ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. టిబి వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు మరియు సాధారణ ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి స్థానిక ప్రజలు విశేష స్పందన చూపించారు. ఈ సందర్భంగా వైద్య బృందం మొత్తం 186 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించింది. అనారోగ్య లక్షణాలతో వచ్చిన పలువురి నుంచి 62 రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. టిబి అనుమానిత లక్షణాలు ఉన్న వారికి ప్రత్యేకంగా ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించగా, మొత్తం 5 మందికి ఎక్స్‌రే పరీక్షలు చేశారు. శిబిరానికి ఇన్‌చార్జ్‌గా డాక్టర్ శ్రీదేవి వ్యవహరించగా, డాక్టర్ అనుష్, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ గాయత్రి వైద్య సేవలు అందించారు. టిబి ఇన్‌చార్జ్ డాక్టర్ రహీమ్ ఆధ్వర్యంలో టిబి నిర్ధారణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ టిబి వంటి వ్యాధులను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ప్రజలు దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ దవాఖానలను సంప్రదించాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సల్మాన్ రాజ్, ల్యాబ్ టెక్నీషియన్ స్వప్న, టిబి సూపర్వైజర్లు రహీమ్ మరియు అర్చన,



హెల్త్ విజిటర్ మధు సేవలు అందించారు. అలాగే ఎమ్‌పిహెచ్‌ఏ (ఎఫ్) సిబ్బంది ధనిబాయి, కలావతి, నిర్మలతో పాటు ఆశా వర్కర్లు యాదమ్మ, సుకన్య, హాజీరా ప్రజలకు అవసరమైన సూచనలు అందిస్తూ శిబిరాన్ని విజయవంతం చేశారు.

# మనికొండ -- నార్సింగి ప్రాంతాల్లో 24 గంటల పాటు నీటి సరఫరా నిలిపివేత

**శంకర్‌పల్లి వద్ద ప్రధాన పైప్‌లైన్ పగిలిపోవడంతో అత్యవసర మరమ్మత్తులు ప్రారంభం**

మైలర్ దేవ్ పల్లి, మే 12 ( వార్త వేదిక సూర్య ) :

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తగా ఏర్పడిన మనికొండ, నేక్నాపూర్, గండిపేట్, నార్సింగి మరియు కోకాపేట్ వార్డుల ప్రజలకు ముఖ్య సమాచారం అందించారు అధికారులు. శంకర్‌పల్లి ప్రాంతంలో 1200 మిల్లీమీటర్ల వ్యాసం గల పీఎస్సీ ప్రధాన తాగునీటి పైప్‌లైన్ అకస్మాత్తుగా పగిలిపోవడంతో ఆయా ప్రాంతాలకు వచ్చే తాగునీటి సరఫరా తదుపరి 24 గంటల పాటు నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సమస్యను పరిష్కరించేందుకు అత్యవసర మరమ్మత్తు బృందాలు వెంటనే పనులు ప్రారంభించాయని, సాధ్యమైనంత త్వరగా నీటి సరఫరా పునరుద్ధ రించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ప్రజలు ముందస్తుగా తాగునీటిని నిల్వ చేసుకోవడంతో పాటు అవసరమైతే ప్రత్యామ్నాయ నీటి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీటి సరఫరాలో ఏర్పడిన అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు సహకరించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) నార్సింగి సర్కిల్ అధికారులు విజ్ఞప్తి చేశారు.



# 22 లక్షల మంది నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి




**డివైఎఫ్ఐ ఎన్‌టీఏను వెంటనే రద్దు చేయాలని డిమాండ్**

నల్లగొండ బ్యూరో, మే 12 (వార్తా వేదిక సూర్య )

నల్గొండలో మంగళవారం నిర్వహించిన డివైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్ మాట్లాడారు. (ఎన్‌టీఏ) నిర్వహిస్తున్న నీట్ పరీక్షల్లో వరుసగా జరుగుతున్న అవ్యవస్థలు, పేపర్ లీక్‌లు దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఇది కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. సంవత్సరాల పాటు కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమైన విద్యార్థుల కలలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు అప్పులు చేసి, నగలు అమ్మి తమ పిల్లలను చదివిస్తుంటే పరీక్షల నిర్వహణలో అవినీతి, భద్రతా లోపాలు వారి ఆశలను దెబ్బతీస్తున్నాయని తెలిపారు.

గతంలో కూడా ఎన్‌టీఏ నిర్వహించిన పలు పరీక్షలు లీకేజ్‌కు గురయ్యాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. వరుస వైఫల్యాలకు కారణమైన ఎన్‌టీఏను వెంటనే రద్దు చేసి పారదర్శకమైన కొత్త పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లెంల శ్రీకర్, పఠాని శ్రీను, గుండాల నరేష్, కట్ట లింగస్వామి, పోకల శశిధర్, పాలది కార్తీక్, కండె యాదగిరి, తరి రామకృష్ణ, ఏడుకొండలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష

**జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్**

నల్లగొండ బ్యూరో, మే 12 (వార్తా వేదిక సూర్య )

నల్లగొండ జిల్లా డిండి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెంబర్ 151/2013 కు సంబంధించి ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులో నల్లగొండ లోని ఎస్సీ/ఎస్టీ ప్రత్యేక సెషన్స్ కోర్టు ఇద్దరు నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందని జిల్లా ఎస్పి తెలిపారు. కేసు వివరాల ప్రకారం చందంపేట మండలం గన్నెర్లపల్లి గ్రామానికి చెందిన నక్క పర్వతాలు (యాదవ్), డిండి మండలానికి చెందిన ఒక ఎస్సీ కులానికి చెందిన యువతీతో పరిచయం పెంచుకొని మాయ మాటలు చెప్పి పెళ్ళి చేసుకుంటానని నమ్మించి బాధిత యువతీని శారీరకంగా వాడుకున్నాడు. అనంతరం యువతీ పెళ్ళి చేసుకోమని అడగగా నక్క పర్వతాలు,తన అత్త అయినా నీలం సత్తమ్మ కలిసి కులాన్ని దుషిస్తూ పెళ్ళికి నిరకరించారని బాధిత యువతీ ఇచ్చిన మేరకు డిండి పోలీస్ స్టేషన్లో (ఐపీసీ) సెక్షన్లు 417, 420, 323, 506 రెడ్ విత్ 109 ఖూజ మరియు ఎస్సీ/ఎస్టీ (అత్యాచార నిరోధక) సవరణ చట్టం 2015 లోని సెక్షన్ 3 (1) (ఎక్స్) కింద కేసు నమోదు చేయబడింది. విచారణ అనంతరం కోర్టు నిందితులు ఏ 1 మరియు ఏ 2 లకు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని సెక్షన్ 3(1)(ఎక్స్) కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది. అదేవిధంగా ప్రధాన నిందితుడు నక్క పర్వతాలు (ఏ 1) కు ఐ పి సి సెక్షన్ 417 కింద ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించగా, ఐ పి సి సెక్షన్ 420 కింద మరో ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించింది. ఐ . పి.సి.సెక్షన్లు 323 కింద ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా మరియు ఐ . పి.సి 506 కింద ఒక్కొక్కరికి 1000 జరిమానా విధిస్తూ, చెల్లించని పక్షంలో రెండు నెలల సాధారణ జైలు శిక్ష విధించాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు అన్ని శిక్షలు ఏకకాలంలో అమలులో ఉండనున్నాయి. దీంతో ఏ 1 నక్క పర్వతాలకు మొత్తం 11 సంవత్సరాల వివిధ శిక్షలు మరియు రూ.5,000 జరిమానా విధించగా, ఏ 2 నీలం సత్తమ్మకు 5 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ.3,000 జరిమానా విధించబడింది. ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా డి.నరసింహ వాదనలు వినిపించారు.కేసు నమోదు సమయంలో దిండి ఎస్సైగా పనిచేసిన ఎం.రామాంజనేయులు ఎఫ్ . ఐ.ఆర్ నమోదు చేయగా,దేవరకొండ ఎస్‌డీపీఓ కె.మనోహర్ దర్యాప్తు నిర్వహించారు. ప్రస్తుతం డిండి పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ గా బాలకృష్ణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.బీసన్న, దేవరకొండ ఎస్.డి.పి.ఓ గా ఎం.వి.శ్రీనివాస్ విధులు నిర్వహిస్తున్నారు. కోర్టు విధుల్లో భాగంగా డిండి పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణన్, పోలీస్ కానిస్టేబుల్ పి.లింగయ్యలు కోర్టు డ్యూటీ అధికారులు వ్యహరించారు. వీరందరిని జిల్లా ఎస్పి కోర్టులో సరైన ఆధారాలు సమర్పించి నిందితులకు శిక్ష పడే విదంగా కృషి చేసినందుకు అభినందిచారు.

## చట్టం అందరికి సమానమే ఉండాలి

**బండి సంజయ్ కుమారుడిని పై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని**

**బహుజన్ సమాజ్ పార్టీ**

**నల్గొండ ఈసీ నెంబర్ సతీష్ బహుజన డిమాండ్**

దేవరకొండ మే 12 (వార్త వేదిక సూర్య ):-




చట్టం అందరికీ సమానం అధికారంలో ఉన్నవారికి, రాజకీయ నాయకులకు చట్టం చుట్టమా” అని నల్గొండ జిల్లా బహుజన సమాజ్ పార్టీ నిలదీశారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథపై నమోదైన పోక్సో పి ఓ సి ఎస్ ఓ కేసు విషయంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలి పోక్సో చట్టం కింద కేసు నమోదైన వెంటనే నిందితులను రిమాండ్లోకి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, భగీరథ విషయంలో అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. బాధితులకు రక్షణ కల్పించాలి. నిందితుడు బయటే ఉండటం వల్ల మైనర్ బాలిక మరియు ఆమె కుటుంబ సభ్యులపై తీవ్ర ఒత్తిడి, బెదిరింపులు వచ్చే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హనీట్రాప్ ఆరోపణలపై అనుమానాలు భగీరథను హనీట్రాప్ చేశారనే ఆరోపణలు హాస్యాస్పదమని, అమ్మాయి కుటుంబం ఫిర్యాదు చేసిన తర్వాతే రాత్రికి రాత్రే కరీంనగర్లో ఎదురు ఫిర్యాదు చేయడం ఎన్నో అనుమానాలకు దారితీస్తోందని పేర్కొన్నారు. నాయకుల మౌనం సిగ్గుచేటు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి గానీ,ఇతర ప్రధాన పార్టీల నాయకులు గానీ స్పందించకపోవడం దారుణమని, దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లు” రాజకీయ నాయకులు ఒకరికొకరు సహకరించుకుంటున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ స్పందించాలి. తెలంగాణ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మంత్రివర్గ సహచరుడి కుమారుడిపై వచ్చిన ఈ తీవ్రమైన ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసు అధికారులు రాజకీయ నాయకులకు కొమ్ముకాయకుండా, చట్ట పరిరక్షకులుగా బాధ్యత వహించి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలని సతీష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసులో నిష్పాక్షిక విచారణ జరిపించకపోతే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించడానికి కూడా వెనకాడబోమని ఆయన పత్రికా ప్రకటన ద్వారా హెచ్చరించారు



## అర్జున్ నాయక్, జ్యోతిల రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్న కేతావత్ భిల్యా నాయక్

దేవరకొండ మే 12
( వార్తా వేదిక సూర్య):-

పీఏపల్లి మండల పరిధిలోని రాంపూరం గ్రామ పంచాయతీ పరిధిలోని నేనావత్ తండ కు చెందిన కీ"శే" సేవ్య నాయక్ కుమారుడు అర్జున్ నాయక్ --జ్యోతి ల రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేతావత్ భిల్యా నాయక్

## వివాహా మహోత్సవ (రిసెప్షన్) కార్యక్రమంలో పాల్గొన్న పిసిసి సభ్యులు పిఎసిఎస్ చైర్మన్ జాలే నరసింహారెడ్డి

దేవరకొండ మే 12
( వార్తా వేదిక సూర్య):-



నేడు చందంపేట మండలంలోని తెల్దేవరపల్లి గ్రామ పరిధిలోని మోత్యతండా గ్రామానికీ చెందిన శ్రీమతి నేనావత్ భామిని, గ్యాంగ నాయక్ గార్ల కుమారుడు (వినోద్ కుమార్, దివ్య)ల వివాహా మహోత్సవ (రిసెప్షన్) కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపి పీసీసీ సభ్యులు పిఎసిఎస్ చైర్మన్ జాలేనరసింహారెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, సర్పంచ్ భరత్ కుమార్, సి టి ఓ నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీటీసీ మహాలక్ష్మయ్య, రమేశ్, ఇద్దయ్య, వెంకులు, సభవత్ లక్ష్మ, మరియు తదితరులు పాల్గొన్నరు

## నిరుపేద కుటుంబ అమ్మాయి పెళ్ళికి అర్థిక సహాయం చేసిన- బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్

దేవరకొండ మే 12(వార్తా వేదిక సూర్య):-



దేవరకొండ పట్టణంలో 14 వ వార్డు కు చెందిన పద్మ కూతురు వివాహనికి బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ తమ వంతు సహాయంగా కొంత నగదు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు14 వార్డు మాజీ అభ్యర్థి బాబా చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్న కేతావత్ భిల్యా నాయక్

దేవరకొండ మే 12 (వార్తా వేదిక సూర్య):-



చందంపేట మండల పరిధిలోని తెల్దేవరపల్లి మోత్య తండ కు చెందిన నేనావత్ బామిణి,గాంగ్య నాయక్ కుమారుడు, స్థానిక సర్పంచ్ భరత్ నాయక్ సోదరుడు వినోద్ కుమార్ --దివ్య ల రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ముత్యాల సర్వయ్య,లాలు నాయక్,హరి నాయక్,రాంబాబు,చందు నాయక్, కిరణ్,సీతా నాయక్, తదితరులు పాల్గొన్నారు

# ధాన్యాన్ని అన్లోడ్ చేసుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి

**జిల్లాలో ఇప్పటివరకు 4 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యంకొనుగోలు**

**ధాన్యం కొనుగోలులో మిల్లర్లు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలి**

**రైతులకు ఇబ్బందులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం**

**జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ హెచ్చరిక.**



"నల్లగొండ బ్యూరో, మే 12 (వార్తా వేదిక సూర్య )

జిల్లాలోని రైస్ మిల్లర్లు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని దించుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. అలా కాదని ప్రైవేటు ధాన్యం దించుకునేందుకు ప్రాధాన్యత ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద లారీల అన్లోడింగ్ జాప్యం జరుగుతున్నదని వార్తలు వచ్చిన నేపథ్యంలో మంగళవారం అయన జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ తో కలిసి మిర్యాలగూడ లోని వాగ్దేవి రైస్ మిల్, మహేశ్వరి పారా బాయిల్డ్ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వాగ్దేవి రైస్ మిల్లును ఆయన తనిఖీ చేసి మిల్లుకు వచ్చిన ప్రభుత్వ, ప్రైవేటు ధాన్యాన్ని పరిశీలించారు. మిల్లు యజమానితో మాట్లాడుతూ.. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన దాన్యం పూర్తిగా కొనుగోలు చేసిన తర్వాత ప్రైవేట్ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాన్యం లోడు లారీల డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. మిల్లుకొచ్చిన లారీలు 12 గంటల్లో అన్లోడ్ చేసుకుని తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు. అవసరమైతే హమాలీలను ఎక్కువ మందిని ఏర్పాటు చేసుకొని అన్లోడ్ ను పెంచాలన్నారు. రానున్న 10 రోజులు జిల్లాలో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, ప్రత్యేకించి ప్రభుత్వ కేంద్రాల ధాన్యం కొనుగోలును వేగవంతం చేసేందుకు ఇతర ప్రాంతాల నుండి ధాన్యం రాకుండా డిండి, అవంతిపురం తదితర ప్రాంతాలలో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ ,రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మిల్లుల వద్ద ఒక పోలీస్ కానిస్టేబుల్ తో పాటు, జిపిఓ, ఇతర అధికారులు నిరంతరం ధాన్యం అన్లోడ్ పర్యవేక్షించాలని, అందరు రైస్ మిల్లర్లు ఇదే విధానాన్ని పాటించాలని చెప్పారు.

అనంతరం మహేశ్వరి పారాబాయిల్డ్ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కాగా ఈ రైస్ మిల్లులో రైస్ మిల్ గుమాస్తా మాడుగుల పల్లి మండలానికి చెందిన ఒక రైతు నుండి డబ్బులు తీసుకున్నాడని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన అన్ని రికార్డులను పరిశీలించి వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని మాడుగులపల్లి తహసిల్దార్ ను ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలో రబీ ధాన్యం సేకరణలోభాగంగా ఇప్పటివరకు 4 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, ఇంకా రెండు లక్షల అరవై వేల మెట్రిక్ టన్నులు దాన్యం కొనాల్సి ఉందని చెప్పారు. మిల్లర్లు త్వర త్వరగా ధాన్యాన్ని అన్లోడ్ చేసుకునేందుకుగాను ఎస్పీ తో పాటు, రైస్ మిల్లులను సందర్శిస్తున్నట్లు చెప్పారు .అన్ని రైస్ మిల్లులకు ప్రైవేటు, ప్రభుత్వ దాన్యం వస్తున్నప్పటికీ మిల్లర్లు ప్రైవేట్ ధాన్యానికి ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రభుత్వ కేంద్రాల ద్వారా వచ్చిన ధాన్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ ధాన్యం పూర్తిగా కొనుగోలు జరిగిన తర్వాత ప్రైవేట్ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లులు ఎంత వీలైతే అంత ధాన్యాన్ని అన్లోడ్ చేసుకోవాలని చెప్పారు.ప్రతి మిల్ పాయింట్ వద్ద ఒక అధికారిని, పోలీసును ఏర్పాటు చేస్తున్నామని, వచ్చిన వాహనాలు 12 గంటల్లోపు ధాన్యాన్ని అన్లోడ్ చేసి తిరిగి పిపిసి కేంద్రాలకు వెళ్లిపోయేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని, రానున్న పది రోజులు జిల్లాలో ప్రైవేటు వ్యక్తుల నుండి వచ్చిన ధాన్యాన్ని హోల్డ్ లో పెట్టాల్సిందిగా ఆయన అధికారులు, మిల్లర్లను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 62 శాతం దాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇంకా 32 శాతం కొనుగోలు చేయాల్సి ఉందని , ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మిల్లర్లకు సంబంధించి బాయిల్డ్ కోట ఇవ్వడం, మిల్లర్ చార్జీలు ఇవ్వడం వంటివి పూర్తి చేయడం జరిగిందని, అందువల్ల మిల్లర్లు సైతం పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి ,రైతులకు సహకరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ.. మిల్లర్లు మిల్ పాయింట్ కి వచ్చిన వాహనాలను 12 గంటల్లో అన్లోడ్ చేసుకోవాలని, అన్లోడ్ చేసుకోవడంలో ఇబ్బందులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీస్ తరపున మిల్లులో ఒక కానిస్టేబుల్ ను ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ ధాన్యాన్ని దించుకునేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్, డిఎస్ఓ వెంకటేశం, తహసిల్దార్ శ్రీనివాస్, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

## బీసీ గురుకులాల్లో సీఈసీ గ్రూపును యధా స్థానంలోకితీసుకువచ్చిన



**కృతజ్ఞతలు తెలిపిన సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి. శ్రీనివాస్ గౌడ్**

దేవరకొండ మే 12 (వార్తా వేదిక సూర్య):-

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ నియోజకవర్గం లో బిసి గురుకులాలైన బాలుర, బాలిక లలో సీఈసీ గ్రూపును గురుకుల సెక్రెటరీ సైదులు తొలగించి వేరే కళాశాలకు మార్చగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆందోళన చేసి రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య కి విజ్ఞప్తి చేయగా విజ్ఞప్తి మేరకు గురుకుల సెక్రటరీ గారితో మాట్లాడి సిఇసి గ్రూపును యధా స్థానంలో తీసుకువచ్చినందుకు దీనితోపాటు జిల్లాలో ఉన్నటువంటి అన్ని బీసీ గురుకులాల్లో తొలగించినటువంటి గ్రూపులన్నింటినీ యదా స్థానంలో తీసుకొచ్చినందుకు ఆర్. కృష్ణయ్య గారికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఆయనకు దేవరకొండ నియోజకవర్గం, జిల్లా ప్రజల ప్రక్షాళన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో బీసీ గురుకులాలకు ఆయన చేసిన సేవలు పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రోత్సహించే విధంగా సహకరించారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు పున్న వెంకటేష్ నేత, చేరుపెల్లి జయలక్ష్మి ,ఎండి రంజాన్ బేగ్, చిలువేరు ముత్తమ్మ, బీమగోని శివ గౌడ్, పెరికేటి శ్రీనివాస్ చారి, లైబ్రరీ శారద, శివ తదితరులు పాల్గొన్నారు

# మహారాష్ట్రలో ఘోరం..

**గుడి గోడ కూలి ఆరుగురు మృతి.. 14 మందికి గాయాలు**

మహారాష్ట్రలో దారుణం జరిగింది. ఒక దేవాలయం గోడ కూలి ఆరుగురు మరణించగా, 14 మంది గాయపడ్డారు. ఈ ఘటన మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా, జాట్ తాలూకా, మోతేవాడి గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా మర్గుబాయ్ దేవి యాత్ర సందర్భంగా వేడుకలు నిర్వహించేందుకు భక్తులు గుడి ప్రాంగణంలో గుమిగూడారు.

ఈ సమయంలో భారీ వర్షం, వేగంగా వీచిన ఈదురుగాలుల కారణంగా అక్కడి గోడ కూలిపోయింది. ఈ ఘటనలో చాలా మంది భక్తులు గోడ శిథిలాల కింద చిక్కుకుపోయారు. వెంటనే స్పందించిన అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. గోడ కూలడంతో గాయాలపాలై ఆరుగురు మరణించారు. మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రుల్ని స్థానిక ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

మృతుల్లో ముగ్గురు స్థానిక గ్రామస్తులు కాగా, మిగతా ముగ్గురు బీజాపూర్ తాలూకాకు చెందిన వారు. మంగళవారం ఈ దేవాలయానికి ఎక్కువ మంది భక్తులు వస్తుంటారని, ఘటన జరిగిన సమయంలో 350 మందికిపైగా భక్తులు ఉన్నారని పోలీసులు తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు సాంగ్లి ఎస్పీ తెలిపారు.

# కూనో నేషనల్ పార్క్‌లో నాలుగు చీతా కూనల మృతి..

**వేరే జంతువు దాడి చేసిందా..?**

మధ్యప్రదేశ్‌లోని కూనో నేషనల్ పార్క్‌లో నాలుగు చీతా కూనలు మరణించాయి. మంగళవారం ఉదయం వీటి కళేబరాల్ని అధికారులు గుర్తించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ 4 కూన పిల్లలు కేజీపీ 12 అనే ఆడ చీతాకు చెందినవి. ఇవి గత నెల 11న జన్మించాయి. ఇవి నాలుగూ సోమవారం ఉదయం వరకు ఆరోగ్యంగానే ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

మంగళవారం పర్యవేక్షకులు ఈ ప్రాంతంలో సాధరణ మానిటరింగ్ నిర్వహిస్తుండగా, నాలుగు కూనల కళేబరాలు కనిపించాయి. వీటిని ఒక జంతువు చంపి తిన్నట్లు ప్రాథమికంగా గర్తించారు. ఈ నాలుగు కళేబరాల్ని వాటి నివాస స్థలం పక్కనే గుర్తించారు. ఈ నాలుగింటి తల్లి క్షేమంగానే ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, నాలుగు కూనలు మరణించిన నేపథ్యంలో ఈ తల్లి చీతా రక్షణ కోసం అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. అలాగే, ఈ చీతాపై మళ్లీ దాడి జరగకుండా భద్రంగా గమనిస్తున్నారు. ఈ చీతా ప్రబర్తన సాధారణంగానే ఉందని అధికారులు అంటున్నారు. నాలుగు చీతాల కళేబరాల్ని అధికారులు పోస్టుమార్టం కోసం తరలించారు. వీటి మృతికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ ప్రాంతంలో నిఘా పెంచారు.

వేరే ఏదైనా దాడి చేసే జంతువు ఉందేమో అని గమనిస్తున్నారు. మరో దాడి జరగకుండా చూస్తున్నారు. వరుసగా వివిధ కారణాలతో చీతాలు మరణిస్తున్న



నేపథ్యంలో ప్రాజెక్ట్ చీతాపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కూనో నేషనల్ పార్క్ పరిధిలో 50 చీతాలున్నాయి. వీటిలో 33 ఇండియాలోనే జన్మించాయి. మరో మూడు చీతాలు గాంధీ సాగర్ అభయారణ్యంలో ఉన్నాయి. దీంతో దేశంలో ప్రస్తుతం 53 చీతాలున్నాయి.



## డిజిటల్‌గా బీఆర్ఎస్ సభ్యత్వం.. జిల్లాల వారీగా ఇంచార్జీలు వీళ్లే..!

: పార్టీ సభ్యత్వ నమోదు విషయంలో బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ విధానానికి ఓటేసింది. పార్టీ ప్రధాన కార్యదర్శులతో సమావేశమైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్(ఖజ=) 'సర్'తో పాటు పార్టీ సమన్వయకర్తల నియమాకాలపై చర్చించారు. మంగళవారం ఎర్రవల్లిలోని నివాసంలో దాదాపు ఆరు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో ప్రతి నియోజక సమన్వయ కర్తలను నియమించారు.

1) కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల చేపట్టిన సర (ూ×=) ప్రక్రియతో పాటు ఓటర్ జాబితా సవరణ, తదితర కార్యాచరణ మొత్తం డిజిటల్‌గా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పార్టీ సభ్యత్వం కూడా డిజిటలైజేషన్ పద్దతిలో జరపాలని బీఆర్ఎస్ ప్రార్టీ ప్రధాన కార్యదర్శులు అభిప్రాయ పడ్డారు.

2) ప్రతి నియోజకవర్గానికి, రాష్ట్ర కమిటీ నుండి సభ్యత్వ సమన్వయ కర్తను నియమించాలని నిర్ణయించారు.

3) ప్రతీ మండలానికి మున్సిపల్ బాడీల వారీగా 'సభ్యత్వ నమోదు కార్యక్రమం సజావుగా నిర్వహించడానికి, సభ్యత్వ సమన్వయ కమిటీ'లను రెండు మూడు రోజుల్లోగా నియమించాలని తీర్మానించారు.

4) డిజిటలైజేషన్ పద్దతిలో సభ్యత్వ నమోదు చేయాలని భావించినందున రాష్ట్రంలోని 35,655 పోలింగ్ కేంద్రాలో.. బూత్‌కు ఇద్దరు కార్యకర్తల చొప్పున మొత్తం 71,310 మంది పార్టీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. డిజిటల్ సభ్యత్వానికి సంబంధించిన విధి విధానాలపై శిక్షణ ఇవ్వాలని సమావేశంలో పాల్గొన్న నేతలు అభిప్రాయ పడ్డారు.

5) పార్టీ సభ్యత్వ నమోదును డిజిటల్ పద్దతిలో చేపట్టేందుకు తగిన శిక్షణా శిబిరాలను పార్టీ ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో కొనసాగించాలని నిర్ణయించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం పలు జిల్లాలకు ఇంచార్జిలను నియమించారు. ఏ జిల్లాలకు ఎవరు ఇంజార్జీగా వ్యవహరిచనున్నారంటే..

ఖమ్మం, కొత్తగూడెం : తక్కళ్లపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్సీ, ప్రధాన కార్యదర్శి.

జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల : జీవన్ రెడ్డి, మాజీ మంత్రి, ప్రధాన కార్యదర్శి

ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ : సత్యవతి రాథోడ్, మాజీ మంత్రి, ప్రధాన కార్యదర్శి

జనగాం, హనుమకొండ, వరంగల్ : పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే, ప్రధాన కార్యదర్శి.

మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట : గ్యాదరి బాలమల్లు, ప్రధాన కార్యదర్శి.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు : గంగాధర్ గౌడ్ మాజీ ఎమ్మెల్సీ, ప్రధాన కార్యదర్శి.

మంచిర్యాల, ఆసిఫాబాద్ : నారదాసు లక్ష్మణ్ రావు, మాజీ ఎమ్మెల్సీ, ప్రధాన కార్యదర్శి.

ఆదిలాబాద్, నిర్మల్ : రావుల శ్రావణ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి.

వికారాబాద్, రంగారెడ్డి : సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే.

మహబూబ్‌నగర్, నారాయణపేట : మహమూద్ అలీ, మాజీ మంత్రి

గద్వాల్, నాగర్‌కర్నూల్, వనపర్తి : మెట్టు శ్రీనివాస్, కార్యదర్శి

మేడ్చల్-మల్కాజిగిరి,యాదాద్రి : పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎంఎల్సీ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్

హైదరాబాద్ : తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే

నల్గొండ, సూర్యాపేట : ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి.

# కొనుగోళ్లలో కొర్రీలు..

**ధాన్యం కేంద్రాల్లో రైతులను వేధిస్తున్న సిబ్బంది**

**తేమ, తాలు పేరుతో వారాల తరబడి కాంటా చేయకుండా జాప్యం**

**తరుగు పేరుతో రైతన్న నిలువు దోపిడీ**

**అధికారుల ఆంక్షలతో కొనుగోలు కేంద్రాలకు వచ్చేందుకు జంకుతున్న రైతన్న**

**తక్కువ ధర వచ్చినా దళారులకే విక్రయిస్తూ..నష్టపోతూ..**

రంగారెడ్డి, మే 12 (వార్త వేదిక సూర్య) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారుల ఆంక్షలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వం హడావుడిగా కేంద్రాలను ప్రారంభించినా అక్కడ వడ్లను కాంటా పెట్టేందుకు పలు కొర్రీలు విధిస్తుండటంతో రైతులు జంకుతున్నారు. అధికారుల ఆంక్షలు తట్టుకోలేక కొందరు తక్కువ ధరకే మధ్యదళారులకు విక్రయించి నష్టపోతున్నారు. జిల్లాలో వరికోతలు ముమ్మరమైనా కొనుగోలు కేంద్రాల్లో మా త్రం అధికారులు ఆశించిన స్థాయిలో సేకరించడంలేదని రైతులు వాపోతున్నారు. ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకెళ్తే తేమశాతం పేరుతో అక్కడే వడ్లను ఎండబెట్టేలా చేస్తున్నారు. అనంతరం తాలు అధికంగా ఉందన్న సాకుతో మరింత జాప్యం చేస్తుండడంతో అన్నదాతలు వారాల తరబడి అక్కడే పరిస్థితులు ఉంటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వారాల తరబడి ఉంటుండటంతో ఇటీవల రాయపోల్ గ్రామంలోని కొనుగోలు కేంద్రం వద్ద వడదెబ్బకు రైతు గౌరయ్య మృతిచెందాడు.

**జిల్లాలో 37 కొనుగోలు కేంద్రాలు..**

రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించేందుకు అధికారులు జిల్లాలో 37 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో ఐకేపీ 9, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 5 కాగా మిగిలినవి సహకారసంఘాల పరిధిలో కొనసాగుతున్నాయి. ఈ కేంద్రాల ద్వారా ఈ ఏడాది 40,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, ఇప్పటివరకు 10,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా కొనలేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలుతెప్పలుగా నిల్వ ఉన్నా అధికారులు మాత్రం సకాలంలో సేకరించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు కేంద్రాల వద్ద వారాల తరబడి నిరీక్షిస్తున్నా కాంటా చేయకపోవడంతో విసుగు చెంది తక్కువ ధర వచ్చినా సరే అని మధ్యదళారులను విక్రయించి నష్టపోతున్నారు.

**క్వింటాల్‌కు నాలుగు కిలోల వరకు..**

కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో అధికారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. క్వింటాల్‌కు రెండు కిలోలు, ఆయా రైస్‌మిల్లుల్లో మరో రెండు కిలోల చొప్పున తరుగు తీసేస్తున్నారు. దీంతో క్వింటాల్‌కు రైతు నాలుగు కిలోల వరకు తరుగును భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే, కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కూలిని కూడా రైతులే భరించాలి. ఈ పరిస్థితిలో రైతులకు గిట్టుబాటు ధర వచ్చే పరిస్థితి కనిపించటంలేదు.

**తరుగు పేరుతో రైతులకు మోసం**

ధాన్యం కొనుగోళ్లలో కేంద్రాల సిబ్బంది రైతును మోసం చేస్తున్నారు. తరుగు పేరుతో క్వింటాకు నాలుగు కిలోల వరకు అన్నదాత నష్టపోవాల్సి వస్తున్నది. అయినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణం. కేంద్రాల్లోని పలు కొర్రీలు పెడుతుండటంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతన్న స్వేచ్ఛగా అమ్ముకోలేని దుస్థితి నెలకొన్నది. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు.

**-మొద్దు అంజిరెడ్డి, రైతు**

# నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లపై మర్రి ఫిర్యాదు

**ఒడ్డెర కులస్తులకు నోటీసులపై ఆగ్రహం**

మేడ్చల్, మే12(వార్త వేదిక సూర్య): మల్కాజిగిరి నియోజకవర్గంలోని అల్వాల్ మండలంలోని నిషేధిత జాబితాలో ఉన్న 582, 583, 22ఏ, సర్వే నంబర్ల భూములను అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అంశాలపై హిమయత్‌నగర్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో ఫిర్యాదు చేశారు. ఇవే భూముల్లో 30 నుంచి 40 సంవత్సరాలుగా నివసిస్తున్న ఒడ్డెర కులస్తులకు మాత్రం నోటీసులు జారీ చేయడం ఏమిటని ఎమ్మెల్యే మర్రి ప్రశ్నించారు.తెలంగాణ వార్తలు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత సబ్‌రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయాలని, ఇటీవల జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని స్టాంప్స్‌అండ్ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే భూదాన్ భూమి సర్వే నంబర్ 537లో ప్రైవేట్ వ్యక్తులు ఇసుక దందా, బస్సుల పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారని ఆరోపించారు. అల్వాల్ ఫైర్ స్టేషన్ నిర్మాణానికి అనుమతులు ఉన్న కొంత మంది అ భూదాన్ భూమిని కబ్జా చేసేందుకు కోర్టులో స్టే తీసుకువచ్చి ఇంటి నిర్మాణాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కౌకూర్ ప్రాంతంలోని రాజీవ్ గృహకల్ప నివాస సముదాయంలో అనర్హులు నివసిస్తే విచారణ జరిపి అర్హులకు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజీవ్ గృహకల్ప నివాసంలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. నేరేడ్‌మెట్, సీబీఎన్ కాలనీలో కౌకుర్ ప్రాంతంలో వాంబే గృహల శిథిలావస్థలో ఉన్నాయని వాటి మరమ్మతులు చేయాలన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిర్మాణంలో అసంపూర్తిగా ఉన్న 6,339 డబుల్‌బెడ్రూం ఇండ్లను మ్యాపింగ్ చేసి అల్వాల్, మల్కాజిగిరి ప్రాంతవాసులకు అందించాలని మర్రి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# టెండర్ల గోల్‌మాల్

**అక్రమాలకు కేరాఫ్‌గా జీహెచ్‌ఎంసీ**

**టెండర్లలో ఒక ఖాతా, బిల్లుల చెల్లింపులు మరొకటి..**

**ఇంజినీరింగ్, ఆడిటింగ్, లీగల్, హెల్త్ సెక్షన్లలో ఏండ్లుగా తిష్ట వేసిన ఏజెన్సీ**

**కాంట్రాక్టర్లు, మాజీ ఎమ్మెల్సీ ఫిర్యాదుపై తీవ్ర చర్చ**

జీహెచ్‌ఎంసీలో టెండర్ల ప్రక్రియ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. నిబంధనలను తుంగలో తొక్కి,నకిలీ పత్రాలతో టెండర్లు దకించుకోవడమే కాకుండా.. ఏకంగా ప్రభుత్వానికే టోకరా వేస్తున్న ఓ సంస్థ బాగోతం ప్రస్తుతం హాట్ టాఫిక్‌గా మారింది. దుర్గా భవాని ఎంటర్ ప్రైజెస్ అనే సంస్థ, దాని అనుబంధ వ్యక్తులు కలిసి సాగిస్తున్న ఈ 'టెండర్ దందా'పై విచారణ జరిపించాలంటూ కమిషనర్ కర్ణన్‌ను కొందరు ఏజెన్సీలు, కనీస వేతనాలు ఇవ్వని ఏజెన్సీలకే మళ్లీ పట్టం కడుతున్నారంటూ ఓ పార్టీ మాజీ ఎమ్మెల్సీ ఫిర్యాదు చేయడమే ఇందుకు నిదర్శనం.

సిటీబ్యూరో, మే 12వార్త వేధిక సూర్య : కొన్ని నెలలుగా ఎల్బీనగర్, ఖైరతాబాద్ జోన్లలో హెల్త్ , ఇంజినీరింగ్, లీగల్ సెక్షన్లలో మ్యాన్‌పవర్ టెండర్లలో అడ్డదారిలో పనులు దక్కించుకుంటున్నట్లు ప్రధాన ఆరోపణ. ఓ మహిళ సదరు శ్రీ దుర్గా భవాని ఎంటర్ ప్రైజెస్ భాగస్వామిగా టెండర్లు దక్కించుకున్నారని, వాస్తవానికి ఏజెన్సీ పేర్కొన్న (పాన్ నం: ఏసీయూఎఫ్ఎస్ 3266) పేరు మీద టెండర్ దకగా, బిల్లుల చెల్లింపులు మాత్రం మహిళా వ్యక్తిగత పాన్ (ఏవైఎంపీ8481 బీ) ఖాతాకు వెళ్లడం గమనార్హం. ఇది తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనే కాకుండా, ప్రణాళికాబద్ధమైన మోసమని తోటి కాంట్రాక్టర్లు కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ అక్రమ టెండర్లు, బిల్లుల మంజూరులో క్షేత్రస్థాయి అధికారుల నుంచి ఉన్నతాధికారుల వరకు హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎల్బీనగర్, ఖైరతాబాద్ జోన్లలో జరిగిన ఈ అక్రమాలపై అదనపు కమిషనర్ విచారణకు ఆదేశించినా, కొందరు ఎస్ఈలు, ఈఈలు విచారణను నీరుగార్చుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ముఖ్యంగా ఒకే పేరు.. ఐదు వేర్వేరు సంస్థల పేరుతో చలామణి అవుతున్న సదరు సంస్థకు మాత్రమే లబ్ధి చేకూరేలా ఇతరులను టెండర్లలో పాల్గొనకుండా అడ్డుకోవడం, షార్ట్ టెండర్ల విషయంలో కనీస గడువు (7-10 రోజులు) పాటించకపోవడం వంటి నిబంధనలతో పనుల అప్పగింతలో రెడ్ కార్పెట్ వేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

ఒక జోన్‌లో పార్టనర్ షిప్ ఫర్మ్ పేరుతో, మరో జోన్‌లో ఇండివిజువల్ పేరుతో టెండర్లు వేస్తూ, ఒకే పాన్ కార్డును ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా వినియోగిస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని, 2021 లో రద్దయిన పార్టనర్ షిప్ డీడ్ ను 2025లో కూడా వాడుతూ టెండర్లలో పాల్గొనడంపై కమిషనర్ విచారణ జరపాలన్న డిమాండ్‌లు వ్యక్తమవుతున్నాయి. నకిలీ ధ్రువపత్రాలతో కోట్లాది రూపాయల టెండర్లు కొల్లగొడుతున్న వారిపై, సహకరిస్తున్న అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర విజిలెన్స్ విభాగంతో సమగ్ర విచారణ జరిపిం చి, బాధ్యులను బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరు తూ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.

# తప్పని తిప్పలు



**తరలని ధాన్యం**

**రైతు కండ్లల్లో దైన్యం**

**మార్కెట్‌లో కర్షకుల పడిగాపులు**

**మార్కెట్లను ముంచెత్తిన మక్కలు**

**నెలరోజుల్లో కొన్నది 60 శాతమే..**

**వర్షాలకు తడుస్తున్న మొక్కజొన్న**

**ప్రణాళికతో సాగని కొనుగోలు ప్రక్రియ**

**మక్కలు తేవద్దని మార్కెట్ వద్ద బోర్డులు**

**ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్న రైతులు**

నాగర్‌కర్నూల్, మే 12 : నాగర్‌కర్నూల్ జిల్లాలో మక్క రైతులకు కష్టాలు తీరడం లేదు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు కూడా వీలు లేకుండా పోతోంది. మక్కలను అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకొస్తే నెలల తరబడిగా కొనగోళ్లలో జాప్యం చేస్తుండడంతో రైతులకు పడిగాపులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మార్కెట్లు మక్కలతో నిండిపోయాయి. ధాన్యం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో తరలించకపోవడంతో రేయింబవళ్లు కాపలా ఉండాల్సిన దుస్థితి నెలకొన్నది. దీంతో వ్యవసాయమంటేనే విసుగొచ్చేలా చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు దుమ్మెత్తి పోస్తున్నారు. రైతు పండించిన ధాన్యాన్ని ప్రణాళికాబద్ధంగా కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడంతో మార్కెట్లలో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

జిల్లా వ్యాప్తంగా కొనుగోళ్లలో జాప్యం జరగడంతో కల్లాల్లోనూ, మార్కెట్లలోనూ మక్కల రాశులు మంచెత్తాయి. మార్కెట్‌కు వచ్చిన ధాన్యం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దవుతోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మార్కెట్ నుంచి తరలించే వరకూ రైతులను కాపలాగా ఉంచడంతో చాలామంది రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఇంటి వద్ద నుంచి సద్దులు తెచ్చుకొని తింటూ కాంటా వేసిన ధాన్యానికి సైతం కాపలాగా ఉంటున్నారు. దీనికితోడు జిల్లా కేంద్రంతోపాటు ఆ యా మండలాల్లో ఏర్పాటు చేసి న కొనుగోలు కేంద్రాల వద్ద దళారులు కొనుగోలు దందా నడిపిస్తున్నారు. తక్కువ ధరకు చిన్న, సన్నకారు రైతుల నుంచి కొనుగోలు చేసి అధిక ధరలకు ప్రభుత్వానికి విక్రయిస్తున్నారు.

**జిల్లా వ్యాప్తంగా కొనుగోళ్లు 60 శాతమే..**

రైతు పండించిన మొక్కజొన్నలను సకాలంలో కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోం ది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 15 కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1.5 మెట్రిక్ టన్నుల మక్కలను మాత్రమే కొనుగోలు చేశారు. అంటే రైతు పండించిన పంటలో కేవలం 60శాతం మాత్రమే కొనుగోలు చేసింది. ఇంతకాలం గన్నీ బ్యాగుల సమస్య, హమాలీల కొరత, కాంటా చేసినా తరలించేందుకు లారీల కొరత ఇలా చెప్పుకుంటూ పోతే ఈ ప్రభుత్వం రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైందని చెప్పవచ్చు. నెలరోజులుగా మార్కెట్‌కు వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో విఫలం కావడంతో కేవలం 60శాతం మాత్రమే మ క్కలను కొన్నారు. ఇంకా ఇంతకు మించి మార్కెట్లలోనూ, పంట పొలాల్లోనూ మక్కలు ఉండిపోయాయి. స్థలం లేకపోవడంతో తుంచిన ధాన్యాన్ని సైతం మార్కెట్‌కు తెచ్చేందుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. నాగర్‌కర్నూల్ మార్కెట్‌లో ఏకంగా ఈనెల 14వ తేదీ వరకు మొక్కజొన్నను మార్కెట్‌కు తీసుకురావద్దని సూచికబోర్డును ఏర్పాటు చేశారు. అంటే రైతు పండించిన పంట కొనుగోలులో ప్రభుత్వం ఎంత జాప్యం చేస్తుం దో అర్థమవుతోంది.



# ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలం

**సన్‌ఫ్లవర్, మక్కలు,శనగలు వెంటనే కొనాలి**

**రైతులంటే రేవంత్‌రెడ్డికి చిన్నచూపు**

**కరోనా టైమ్‌లోనూ సజావుగా ధాన్యం కొన్నం**

**బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు**

**బండచర్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం విజిట్**

సిద్దిపేట,మే12 : కరోనా సమయంలో ప్రపంచమంతా స్తంభించినా కేసీఆర్ నాయకత్వంలో ఆనాడు గ్రామాల్లోనే కేంద్రాలు ఏర్పాటు చేసి విజయవంతంగా ధాన్యం కొన్నామని, రైతులకు రైతుబంధు ఇచ్చామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం బండచర్లపల్లిలో ధాన్యం కోనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. 15 రోజులైనా లారీలు రావడం లేదని రైతుల చెప్పగా, వెంటనే ఆర్డీవోతో హరీశ్‌రావు ఫోన్‌లో మాట్లాడారు. లారీలను పంపించి ధాన్యం త్వరగా మిల్లులకు తరలించాలని కోరారు. ఈ సందర్భంగా విలేకరులతో హరీశ్‌రావు మాట్లాడుతూ.. సకాలంలో మిల్లర్లు ధాన్యం దిం చుకోకపోవడం, అధికారులు పట్టించుకోక పోవడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు నెల రోజులుగా పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితిని అర్థం చేసుకొని సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

వడ్ల కొనుగోలులో సీఎం, మంత్రులకు పట్టక, అధికారులు పట్టించుకోకపోవడంతో రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని మార్చి 22న సిద్దిపేటకు రేవంత్‌రెడ్డి వచ్చినప్పుడు ఒక ఎకరాకు వేశారని, 45 రోజుల్లో రైతుబంధు డబ్బులు పూర్తి గా చేవేస్తామని చెప్పి 52 రోజులు దాటినా వేయడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్నీ ఇబ్బందులే ఎదురవుతున్నాయని అన్నారు. బుస్సాపూర్‌కు చెందిన రైతు యాదయ్య మక్కలు విక్రయించడానికి తెస్తే, గన్నీ బ్యాగులు ఇవ్వకుండా 20 రోజులు కాంటా చేయలేదన్నారు. తీరా ఆ రైతుల బయట సంచులు కొనుక్కోని తెస్తే కాంటా పెట్టారని, ఈ దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం కారణం అని హరీశ్‌రావు విమర్శించారు. సంచులు ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్‌ది అని హరీశ్‌రావు మండిపడ్డారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులపై ప్రేమ లేదన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి రాలేదన్నారు. కరోనా సమయంలోనూ రైతుబందు ఆపలేదని, కరోనా టైంలో ధాన్యం కొనుగోలుకు హమాలీలు దొరక్కపోతే బీహారు ప్రభుత్వంతో మాట్లాడి ప్రత్యేక రైళ్లు పెట్టి హమాలీలను తెచ్చి కాంటాలు పెట్టినట్లు గుర్తుచేశారు.

వెంటనే సన్‌ఫ్లవర్ కొనుగోళ్లు ప్రారంభించాలి

ప్రభుత్వం వెంటనే సన్‌ఫ్లవర్‌ను కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మొక్కజొన్న, శనగల కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. ఇప్పటికైనా సీఎం, మం త్రులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని హరీశ్‌రావు సూ చించారు. ఇప్పటి వరకు కొన్న మొక్కజొన్న,సన్‌ఫ్లవర్, శనగల రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమచేయాలన్నారు. ధాన్యం తరలింపులో జాప్యాన్ని పరిష్కరించాలని సూచించారు. ఆర్టీఏ, రెవెన్యూ, పోలీసులను సమన్వయం చేసి లారీలు తీసుకువచ్చి ధాన్యం తరలించాలని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి మెదక్ జిల్లాలో తాను మంత్రిగా కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలతో సందర్శించానని, ఆర్టీఏ, రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులను సమన్వయ పరి చి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూశామని, ఎక్కడా సమస్య రాకుం డా చేశామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర యాదయ్య, సర్పంచ్ నాగరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు సంపత్‌రెడ్డి, ప్రభాకర్‌వర్మ, పోచబోయిన శ్రీహరి యాదవ్, కిషన్‌రెడ్డి సోమిరెడ్డి,ఎల్లారెడ్డి, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ విధ్వంసం

సిటీబ్యూరో, మే 12: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న పరిసరాల్లో చెట్లను నరుకుతున్నారు. దీంతో పర్యావరణ వేత్తలు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పచ్చదనం, ప్రకృతి సమతుల్యతపై జరుగుతున్న ఈ చర్యలపై వాకర్లు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పేరిట విధ్వసం సృష్టిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు.

# మల్లాపురంలో వరి ధన్యాన్ని తగలపెట్టి రైతుల నిరసన



**యాదగిరిగుట్ట మే12 (వార్త వేదిక సూర్య) :** నెల రోజులుగా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయట్లేదని కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రంగా ఆరోపణలు చేస్తూ రైతులు నిరసన వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడ్ల బస్తాలను తగలబెట్టి వినూత్నంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆరు గాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల కంట కన్నీరు పెట్టిస్తుందన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో తీవ్రమైన జాప్యం చేస్తుండడంతో పాటు తరుగు పేరిట మోసం చేస్తున్న వారిని నియంత్రించకపోవడం, కెసిఆర్ హయంలో వ్యవసాయం పండుగలా ఉండగా నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వ్యవసాయం దండగ లాగా చేస్తున్నారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రోజురోజుకు ధాన్యం కొనుగోలు జరిగేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో దాన్యం కొనుగోలు పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ పార్టీ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, గ్రామ శాఖ అధ్యక్షుడు గౌడ శ్రీశైలం, రైతులు కర్రె చంద్రశేఖర్, ఒగ్గు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చొరవ చూపాలి



**మోత్కూరు, మే 12 ( వార్త వేదిక సూర్య):** వేసవి సెలవులల్లో విద్యార్థులను సెల్ ఫోన్ లకు దూరం ఉండేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని గ్రంథాలయం చైర్మెన్ కోమటి మత్స్యగిరి అన్నారు. వేసవి సెలవులల్లో విద్యార్థులు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండేలా మోత్కూరు శాఖా గ్రంథాలయం తలపెట్టిన గ్రంథాలయంలో ఒక రోజు కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది.తొలి రోజు 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు.తల్లిదండ్రుల నుండి డే విత్ లైబ్రరీ కార్యక్రమం పట్ల మంచి స్పందన వస్తుందని, విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని మత్స్య గిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే12 నుండి జూన్ 12 వరకు గ్రంథాలయ పనివేళలు ఉదయం 8:00 నుండి 11:00 గంటలకు వరకు మధ్యాహ్నం 3:00 గంటల నుండి 6:00 గంటల వరకు విద్యార్థులు గ్రంథాలయంలో గడపాలన్నారు. ఎక్కువ రోజులు గ్రంథాలయంలో పుస్తక పఠనం పాల్గొనే 10 మంది విజేతలకు రూ 2500 నగదుతో సన్మానం చేస్తామన్నారు. విద్యార్థులు అధిక సంఖ్య లో పాల్గొని విజేతలు గా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఏలాంటి ప్రవేశ రుసుం లేదన్నారు. బుధవారం నుండి స్నాక్స్ కూడా అందించటంతో పాటు ప్రముఖులతో ప్రేరణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ వైస్ చైర్మెన్ పోచం బిక్షపతి, లైబ్రరీ ఇంచార్జి చిలక మర్రి బాబుచారి చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# బండి భగీరథను అరెస్ట్ చేయాలి

**బి.ఆర్.ఎస్ నేతలు డిమాండ్**



**మోత్కూరు, మే 12 (వార్త వేదిక సూర్య):** కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమారుడు ఓ మైనర్ బాలికపై లైంగిక దాడి పాల్పడిన బండి భగీరథను తక్షణమే అరెస్ట్ చేయాలని, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొణతం యాకుబ్ రెడ్డి,బి.ఆర్.ఎస్ మండల,పట్టణ అధ్యక్షులు పోన్నెబోయిన రమేష్,జంగ శ్రీను డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంజయ్ జైశ్రీరామ్ అంటూ రావణాసురుడు లాంటి కుమారుడ్ని కాపాడటం ప్రయత్నం చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లేనని అన్నారు. మైనర్ బాలికకు లోపర్చుకొని లైంగికంగా దాడి చేస్తే ఆ అమ్మాయి కుటుంబం మాకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తే ఫోక్సో చట్టం క్రింద కేసు పెట్టి వారం రోజులు కావోస్తున్న భగీరథను పోలీసులు వరస చేయకుండా కాలయాపన చేయడం చూస్తుంటే ఆ కేసులు నీరుగార్చే ప్రయత్నం చేసినట్లేనని పేర్కొన్నారు. గతంలో ఇంతకన్నా చిన్న కేసులకే గందరగోళం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం మౌనం పాటిస్తుందంటే బిజెపి కాంగ్రెస్ ఒక్కటేనని అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని కుటుంబాన్ని వేధించడం బెదిరించడం చేస్తే తెలంగాణ ప్రజలు ఏకమై భగీరథను అరెస్టు చేసి శిక్షపడే వరకు బి.ఆర్.ఎస్ ఆధ్వర్యంలో . పోరాటం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రైతుబంధు మాజీ మండల అధ్యక్షుడు కొండ సోంమల్లు , బారాస పట్టణ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేశం, బిఆర్ఎస్ బీసీ భాగం మండల అధ్యక్షులు పానుగుల్ల విష్ణుమూర్తి, స్థానిక నాయకులు మర్రి అనిల్ కుమార్ , పూరెల్ల పరమేష్, పురుగుల మల్లయ్య, కూరెళ్ళ రమేష్, బందెల పొన్నెబోయిన మత్స్యగిరి,అన్నం దాసు విద్యాసాగర్, రాజిరెడ్డి, కొంపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. ,

# పిస్తా హౌస్ ను వెంటనే సీజ్ చేయాలి

**బిర్యానీలో ఈగలు..**
**పిస్తా హౌస్‌లో కస్టమర్‌తో వాగ్వాదం**
**ఫుడ్ నాణ్యత లేని హోటల్స్ ను**
**వెంటనే సీజ్ చేసి చర్యలు తీసుకోవాలి**




**మహేశ్వరం మే 12 వార్తా వేదిక సూర్య** మహేశ్వరం మండల పరిధిలోని తుక్కుగూడలో ఉన్న పిస్తా హౌస్‌లో ఆహార నాణ్యతపై మరోసారి విమర్శలు వెల్లువెత్తాయి. తుక్కుగూడకు చెందిన అంగోత్ సందీప్ తన కుటుంబ సభ్యులతో కలిసి హోటల్‌కు వెళ్లి జఫ్రాని చికెన్ బిర్యానీ ఆర్డర్ చేశారు. బిర్యానీ తింటుండగా అందులో ఈగలు కనిపించడంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. దీనిపై హోటల్ సిబ్బందిని ప్రశ్నించగా, సమస్యను పరిష్కరించాల్సిందిపోయి కస్టమర్‌తో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. బిల్ తప్పనిసరిగా చెల్లించాలని యాజమాన్యం ఒత్తిడి తెచ్చిందని బాధితుడు ఆరోపించాడు. ఈ ఘటనతో కొంతసేపు హోటల్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఇదే పిస్తా హౌస్‌లో గతంలో కూడా ఆహారంలో పురుగులు, బొద్దింకలు వచ్చిన ఘటనలు వెలుగులోకి వచ్చినప్పటికీ యాజమాన్యం తీరు మారడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు హోటల్‌పై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# కనులపండుగగా పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు

**స్వామివారిని దర్శించుకున్న**
**కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**



**కోరుట్ల, మే 12:(వార్త వేదిక సూర్య )** కోరుట్ల పట్టణంలోని 6వ వార్డు ఏకిన్ పూర్ శివారులో పంచముఖ హనుమాన్ ఆలయం మంగళవారం భక్తిపారవశ్యంలో మునిగితేలింది. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయంలో పెద్ద హనుమాన్ జయంతోత్సవాలను వార్డు ప్రజలు, భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలు కనులపండువగా జరగడమే కాకుండా, ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు హాజరయ్యారు. వారితో పాటు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మాజీ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, నాయకులు సరికెల్లా నరేష్, మరిపెల్లి జనార్ధన్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి మంగళహారతులతో వేద ఆశీర్వచనాలు అందజేశారు. లోక కల్యాణం కోసం, నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాల కోసం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. పూజా కార్యక్రమాల అనంతరం స్థానిక వార్డు కౌన్సిలర్ మేడిపల్లి శిరీష శేఖర్ రెడ్డి అతిథులను కండువాలతో కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. హనుమన్నామ స్మరణతో ఏకిన్ పూర్ వీధులన్నీ మారుమోగిపోయాయి. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేయడంతో ఉత్సవం దిగ్విజయంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కాశిరెడ్డి వెంకటా రెడ్డి, సీనియర్ నాయకులు బన్న రాజేష్, జాగిలాం భాస్కర్, మ్యాదరి లక్ష్మణ్, శనిగరపు రాజేందర్, మ్యాదరి అరుణ్ కుమార్, జాగిలం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి దేవాలయంలో పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు

**ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్పర్సన్**



**కోరుట్ల, మే 12:(వార్త వేదిక సూర్య** కోరుట్ల పట్టణ ఆనంద్ నగర్ లో గల పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాన్ని అందజేసి వేద ఆశీర్వచనాన్ని అందించారు అనంతరం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక అవార్డు కౌన్సిలర్ జాల మాధవి వినోద్ లతో కలిసి టెంకాయ కొట్టి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ అనంతరం మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ ఆంజనేయ స్వామి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ స్థానిక అవార్డు కౌన్సిలర్ జాల మాధవి వినోద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ నాయకులు సంఘ లింగం జాల వినోద్ గుంటుక జ్ఞానేశ్వర్ గుంటుక మహేష్ భక్తులు మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు

# నేటి నుంచి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

**మోత్కూరు, మే 12 ( వార్త వేదిక సూర్య):** ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం ప్రథమ, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం జరగనున్నాయి. ఈ పరీక్షలకు 182 మంది హాజరుకానున్నారని ప్రిన్సిపాల్ రవీందర్,డివో సొల్లేటి మంగళవారం ఒక ప్రకటనలో వెంకటాచారి తెలిపారు.ఈ పరీక్షలకు విద్యార్థులకు ఏలాంటి అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



# కొనుగోలు కేంద్రాలకు లారీల కొరతలేకుండా చూడాలి

**రైతు సంఘం మండల కార్యదర్శి**
**దడిపల్లి ప్రభాకర్**



**మోత్కూరు, మే 12 (వార్త వేదిక సూర్య):** ధాన్యాన్ని కాంటాలు వేసినప్పటికీ దిగుమతి చేసుకోవడలో రైతులను కమీషన్ల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్న మిల్లర్లపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, రైతు సంఘం మండల కార్యదర్శి దడిపల్లి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 రోజులుగా కొనుగోలు కేంద్రాలలో దాన్యం రాశు లు పోసుకొని, కాంటాలకోసం రైతులు ఎదురుచూస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఒక్కో కేంద్రానికి రోజుకు ఒకటి,రెండు లారీలను మాత్రమే కేటాయించడంతో కాంటా వేసిన దాన్యం దిగుమతుల సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అకాల వర్షాలవల్ల దాన్యం తడసి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని, క్వింటాలుకు మూడు కేజీల తరుగు తీస్తేనే దాన్యం దిగుమతి చేసుకుంటామని మిల్లర్లు కోర్రీలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ ఉండి, తూర్పార పట్టిన దాన్యాన్ని కాంటాలు వేసినా,ఏదో ఒక వంక పేరుతో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.ఐకేపీ కేంద్రల నిర్వాహకులు కొంతమంది మిలర్లతో కుమ్మకై కావాలనే దాన్యం ఎగుమతులల్లో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. కమిషన్ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న మిలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి లారీల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు పిట్టల చంద్రయ్య, వెంది యాదగిరి, అంతటి పరమేష్, ముక్కమూల లక్ష్మమ్మ, బద్దం విజయందర్ రెడ్డి, ముక్కామూల శేఖర్,సింగిరెడ్డి భూపాల్ రెడ్డి,తొంట అంజయ్య, కొంపల్లి శోభ తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కరాటే శిక్షణ కేంద్రం ప్రారంభం

**రామన్నపేట, మే12 (వార్తా వేదిక సూర్య)** మండలం మునిపంపుల గ్రామంలో భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా ఉచిత కరాటే శిక్షణ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. కరాటే వంటి యుద్ధకళలు విద్యార్థుల్లో ధైర్యాన్ని పెంచడమే కాకుండా స్వీయ రక్షణకు కూడా ఉపయోగపడతాయని తెలిపారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా శిక్షణలు అందించడం జరుగుతుందని





అన్నారు.వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు క్రీడలు, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. భవిష్యత్తులో కూడా గ్రామంలో విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలకు గ్రామ పంచాయతీ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ రాచకొండ రాజు,నాయకులు తాళ్ళపల్లి జితేందర్,గంటెపాక శివ కుమార్,తొలుపునూరి చంద్ర శేఖర్,బూడిద బిక్షం, జంపాల ఉమాపతి, ఆకుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి
సంపుటి : 1 సంచిక : 346
వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి
బుధవారం,
మే 13, 2026

# కుక్కలు బాబోయ్ కుక్కలు..!

▶▶ సుద్దాల గ్రామంలో వీధి కుక్కల స్వైర విహారం గొర్రెలపై దాడి, గ్రామస్తుల్లో భయాందోళన

**గుండాల వార్తవేదిక సూర్య మే 12 :** యాదాద్రి భువనగిరి జిల్లా సుద్దాల గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతోంది. గ్రామంలోని పలు వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండగా, తాజాగా గొర్రెల మందపై దాడి చేసి పలుగొర్రెలను చంపివేసిన ఘటన గ్రామంలో కలకలం రేపింది.సుద్దాల గ్రామానికి చెందిన గొర్ల కాపరి గూడ మధు, సోమయ్యలకు చెందిన గొర్రెల మందపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో గొర్రెలు తీవ్రంగా గాయపడి కొన్ని మృతి చెందినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవనాధారంగా ఉన్న గొర్రెలు చనిపోవడంతో తమకు భారీ నష్టం వాటిల్లిందని వారు లబోదిబోమంటున్నారు.గ్రామంలో చిన్నారులు, మహిళలు, వృద్ధులు బయటకు





రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు ఎవరిపై ఎప్పుడు దాడి చేస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మొన్న బర్లపై, ఈరోజు గొర్రెలపై దాడి చేసిన కుక్కలు రేపు మనుషులపై దాడి చేస్తాయేమోనన్న భయం గ్రామ ప్రజలను వెంటాడుతోంది.గ్రామస్థులు పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిమ్మకు నీరెత్తినట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. వెంటనే గ్రామంలో తిరుగుతున్న వీధి కుక్కలను నియంత్రించి ప్రజలకు రక్షణ కల్పించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అధికారులు ఇప్పటికైనా స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పెరిక కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయం

- కోట సుధాకర్



**రామన్నపేట, మే 12, (వార్తా వేదిక సూర్య) :** పెరిక కులస్తులను గుర్తించి వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి కోట సుధాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు దేశంలోనే ఎక్కడ లేని విధంగా మన తెలంగాణ రాష్ట్రంలో పెరిక కులాన్ని గుర్తించి వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి అధ్యక్షుడిగా దొంగరి వెంకటేశ్వర్లు గారిని మరియు ఉపాధ్యక్షులుగా బుడిగం శ్రీనివాస్ గారిని నియమించడం ఎంతో సంతోషకరమైన విషయం అందుకుగాను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారికి మంత్రులు పొన్నం ప్రభాకర్ గారికి, ఉత్తంకుమార్ రెడ్డి గారికి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి యాదాద్రి జిల్లా పెరిక కులస్తుల అందరి తరపున ప్రత్యేక ధన్యవాదములు ఇదేవిధంగా మా పెరిక కులాన్ని అంచలంచలుగా ఎదగడానికి మీ తోడ్పాటు ఎంతో అవసరం రాబోయే ఎలక్షన్లలో మాకు ప్రత్యేక కోటాను ఏర్పాటు చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ పట్టణ అధ్యక్షుడు ఉగ్గే రాజేష్ వారి కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహేశ్వరం గ్రామంలో సమస్యల పరిష్కరించాలని వినతి

**మహేశ్వరం మే 12 వార్త వేదిక సూర్య** మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి,కి మహేశ్వరం గ్రామంలో 12వ వార్డు 13వ వార్డు . 14వ వార్డు. బేడ బుడగ జంగాల బస్తీ లలో తీవ్ర నీటి సమస్య మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ. మరియు సీసీ రోడ్డు. నిధులు మంజూరు చేయించాలని కోరడం జరిగింది. మహేశ్వరం గ్రామంలో ఇల్లు లేని వారికి డబల్ బెడ్ రూములు. ఇప్పించాలని కోరడంతో కేఎల్ఆర్ స్పందించి త్వరలో అధికారులచే లబ్ధిదారుల ఎంపిక చేయించి అర్హులైన వారికి డబల్ బెడ్ రూములు అందజేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఒత్తుల రఘుపతి. శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్.కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగల్ల లాజర్.మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ



మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా. శివగంగ ఆలయ కమిటీ డైరెక్టర్లు పేయ్యల దేవేందర్. ఒగ్గు శంకర్ . కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహేశ్వరం మండల అధ్యక్షులు శెట్టి అశోక్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం గ్రామ 10 వ వార్డు ఇంచార్జ్ కాకి మల్లేష్ ముదిరాజ్. 14 వార్డు ఇంచార్జ్ పుట్లగారి చందు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోతే యాదయ్య. గగనం ఆంజనేయులు. యువ నాయకులు పినమౌని శ్రీకాంత్ ముదిరాజ్. తదితరులు వినతి పత్రం అందించారు,

## యాదగిరి కొండపైన ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**యాదగిరిగుట్ట మే 12 (వార్త వేదిక సూర్య) :** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో హనుమాన్ జయంతి పురస్కరించుకొని కొండపైన పుష్కరిణి వద్దగల ఆంజనేయ స్వామి ఆలయం లో ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్ర చార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేద పండితులు, పురోహితులు ఘనంగా నిర్వహించారు. అభిషేకం ప్రత్యేక అలంకారం, హనుమాన్ చాలీసా పారాయణం, సుందరకాండ పారాయణం, వేద పఠనం లక్ష తమలపాకు అర్చన, మహామంగళ హారతి చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేయడం జరిగినది. ఈ వేడుకలో ఆలయ ఈవో భవాని శంకర్, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఉప ప్రధాన అర్చకులు శ్రీధరాచార్యులు, ఆదిత్యాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.





## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : లక్ష్మారెడ్డి

**మహేశ్వరం మే 12 వార్త వేదిక సూర్య** సీఎంర్ఫ్ చెక్కులతో రోగుల కుటుంబాలకు ఆర్థిక స్వాంతన ప్రభుత్వానికి భారమైనా సీఎం రేవంత్, వెనకడుగు వేయరు, పేదల ఆరోగ్యానికి భద్రతగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, అన్నారు.ఇవాళ తుక్కుగూడ కార్యాలయంలో 50 మందికి సీఎంర్ఫ్ చెక్కులను రోగులు, వారి బంధువులకు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి, మాట్లాడుతూ... ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య చికిత్స తీసుకున్నా... సీఎంర్ఫ్ తో కొంత ఆర్థిక చేయూత అందిస్తున్నామని కె ఎల్ ఆర్, తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్థిక భారమైన పేదల వైద్యానికి ఎంత ఖర్చయినా... భరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ అందించటం సంతోషమని కాంగ్రెస్ నేతలు, రోగుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేక డెస్క్ పెట్టి సీఎంర్ఫ్ చెక్కులు అందించేందుకు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు, రోగులు, వారి బంధువులు పాల్గొన్నారు.





## ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవం

**రామన్నపేట, మే 12(వార్తా వేదిక సూర్య) :** రామన్నపేట మండల కేంద్రంలో శ్రీ వీర హనుమాన్ జయంతి పురస్కరించుకొని స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో ఉన్న హనుమాన్ దేవాలయము లో మంగళవారం రోజున ఘనంగా హనుమాన్ జయంతిని నిర్వహించారు. హనుమాన్ జయంతి పురస్కరించుకొని భక్తులు ఉదయం నుంచి భక్తిశ్రద్ధలతో హనుమాన్ దేవాలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం ప్రారంభించిన సర్పంచ్ సత్యనారాయణ హనుమాన్ జయంతిని పురస్కరించుకొని స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో అన్నదానం కార్యక్రమాన్ని రామన్నపేట మేజర్ గ్రామ సర్పంచ్ గరిక సత్యనారాయణ ప్రారంభించారు. హనుమాన్ జయంతి కార్యక్రమంలో హనుమాన్ దేవాలయం కమిటీ సభ్యులు కొంపెల్లి విజయానందం, గోదాసు



సుగ్రీవులు,లవణం ఉపేందర్, కోట సుధాకర్, జేల్లా వెంకటేష్, డొగి పర్తి సుభాష్, లవణం నరేందర్ తదితరులు పాల్గొన్నారు

## జనగణనలో ప్రజలు సహకరించాలి



**మోత్కూరు మే12 (వార్త వేదిక సూర్య):** జనగణన ప్రక్రియలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించాలని సెన్సెస్ ఛార్జ్ ఆఫీసర్, తహశీల్దార్ పి.జ్యోతి కోరారు. మండల పరిధిలోని ఆనాజీపురం గ్రామంలో మంగళవారం అసిస్టెంట్ ఛార్జ్ ఆఫీసర్ ఎంపీడీవో బాలాజీ ఆర్.ఐ.సుమన్ లతో కలిసి జనగణన సర్వే తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్యూమా రేటర్ల సర్వే సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను ఏ విధంగా నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. సమాచార సేకరణలో ఏలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.జనగణన ప్రక్రియ అత్యంత కీలకమైనదని, ప్రతి ఇంటి వివరాలను , పారదర్శకంగా నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించే గణాంకాలు భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ జనగణన నమోదులో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ప్రజలు తమ వద్దకు వచ్చే సర్వే సిబ్బందికి సరైన సమాచారం ఇచ్చి జనగణన ప్రక్రియకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఓ కృష్ణ, సూపర్వైజర్ ఎస్ లింగస్వామి ఎఎన్యూమారేటర్లు రమేష్, సతీష్ ,యాదయ్య పంచాయతీ కార్యదర్శి జి.శోభన్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




మీ చిన్నారుల పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా !
అయితే మా వార్తావేదిక సూర్య దినపత్రికలో కేవలం 1000 రూ॥లకే ప్రచురించబడును.
వివరాలకు సెల్: 9985389183
AD SIZE: 100 MM X 80 MM

పదవీ విరమణ శుభాకాంక్షలు

మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో ఉద్యోగులు
ఏవరైనా రిటైర్డ్ అవుతున్నారా ! అయితే వారికి మీరు
శుభాకాంక్షలు తెలుపాలనుకుంటున్నారా
మా వార్త వేదిక సూర్య దినపత్రిక
ద్వారా తెలియజేయగలరు.
పూర్తి వివరాలకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
సెల్: 9985389183, 7386949183


Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**